క్లుప్తంగా

శ్రీ విష్ణు సహస్ర నామస్తోత్రం ప్రతులు అందజేత



విష్ణు సహస్ర నామస్తోత్రం ప్రతులను వెంకటరామయ్యకు అందజేస్తున్న మాచిరాజు

అడ్డతీగల: రాజమండ్రికి చెందిన అన్నమయ్య భావనాతరంగిణి సంస్థ ద్వారా ముద్రించిన విష్ణు సహస్ర నామస్తోత్రం ప్రతులను ఆదివారం అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రం సంస్థ నిర్వాహకులు మాచిరాజు క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్యకి అందజేశారు. విష్ణు సహస్ర నామ స్తోత్రం ప్రతిను రూ.252 కాగా భక్తులకు రూ.100కు అందజేస్తున్నట్టు మాచిరాజు తెలిపారు. ప్రముఖ దేవాలయాలకు ఉచితంగా సరఫరా చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మాచిరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలని చెప్పారు. కొయ్యూరు, తోటపల్లి తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం బలోపేతానికి కృషి



మాధవరావు

జి.మాడుగుల: మండలంలోని నాయిబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం సమావేశం ఆదివారం వై.కంఠవరం జలపాతం సమీపంలో జరిగింది. మండల మత్స్యమాడుగులమ్మ నాయీబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం నూతన అధ్యక్షుడిగా కాతా మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా రాము, సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సంద ర్భంగా సంఘం అధ్యక్షుడు మాధవరావు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన నాయీబ్రాహ్మణులు పాల్గొన్నారు.

చిన్నారుల నగర సంకీర్తన



నగర సంకీర్తనలో పాల్గొన్న చిన్నారులు

రాజవొమ్మంగి: మండలంలోని శరభవరం పంచాయతీ వణకరాయి గ్రామంలో ఆదివారం పిల్లలు పెద్దలు ఆదివారం నగర సంకీర్తనలో పాల్గొన్నారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఆదివారం ఈ విధంగా రామాలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి శ్రీరామనా మం జపిస్తు నగర సంకీర్తన చేస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ంలోని గంగాలమ్మ, దుర్గమ్మ, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

200 మందికి వైద్య పరీక్షలు



అన్నదానం చేస్తున్న సిబ్బంది

రంపచోడవరం: మండలంలోని సిరిగిందలపాడు రామకృష్ణ మిషన్ సంచార వైద్యశాలలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్లు టి.వి.సుబ్బారావు, శ్రీనివాసరాయుడు, సంపత్‌కుమార్‌లు రోగులకు వైద్య సేవలు అందించారు. సుమారు 200 మంది వైద్య శిబిరానికి వచ్చి వైద్య సేవలు పొందారు. రోగులకు, సహాయకులకు అన్నదానం చేశారు. క్యాంప్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, వలంటీర్లు పాల్గొని సేవలందించారు.

సంతలో ప్రచారం

కొయ్యూరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ బలపర్చిన కె.రమాప్రభకు ఓటు వేయాలని సీపీఎం, గిరిజన సంఘం నేతలు ఆదివారం సంతలో ప్రచారం చేశారు. గిరిజన సంఘం నేత ఎస్.సూరిబాబు మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరూ రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వసతి గృహానికి కొత్త సొబగులు



అధునాతన సదుపాయాలతో నిర్మిస్తున్న బాలికల వసతి గృహం

- కళాశాల విద్యార్థినులకు తీరనున్న వసతి సమస్య
- నూతన హంగులతో నిర్మితమవుతున్న హాస్టల్
- విద్యార్థులు, తల్లిదండ్రుల హర్షాతిరేకం

ముంచంగిపుట్టు: సరైన వసతి భవనం లేక గిరిజన విద్యార్థులు ఇంటి నుంచే రాకపోకలు చేస్తూ చదువులు కొనసాగించారు. వసతి సమస్యతో కాలం వెళ్లదీస్తూ వచ్చారు. గత పాలకులు సమస్యను కనీసం పట్టించుకోకుండా విస్మరించారు. అదంతా గతం... రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ విద్యాలయాల రూపురేఖలు మారిస్తోంది. పాఠశాలలు, కళాశాలల్లో అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. దీంతో విద్యాలయాల్లో కొత్త సొబగులు సంతరించుకుంటున్నాయి.

తీరిన ఇక్కట్లు

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలిక వసతి గృహం అరకొర వసతి, తాగునీటి, మరుగుదొడ్ల సమస్యతో పాటు కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడ్డారు. దీంతో సమస్యను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ద్వారా రూ.90లక్షలు, తాగునీటి పథకం నిర్మాణం కోసం మరో రూ.25లక్షలను మంజూరు చేసింది. దీంతో ఎన్నో ఏళ్లగా అసంపూర్తిగా దర్శనమిస్తున్న కళాశాల బాలిక వసతి గృహానికి మోక్షం కలిగింది. కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి చెందిన 123 మంది విద్యార్థినులు అభ్యసిస్తున్నారు. అత్యాధునిక సౌకర్యాలతో పెద్ద పెద్ద గదులు, మరుగుదొడ్లు, నిరంతరం నీటి సరఫరా, సువిశాల డైనింగ్ హాల్‌ను నిర్మించారు. వసతి గృహంలో అధునిక సదుపాయాలు కల్పించారు. ప్రస్తుతం 90శాతం పనులు పూర్తయ్యాయి. మరో నెల రోజుల్లో భవనంలో మిగిలి ఉన్న విద్యుత్, పెయింటింగ్ పనులు పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధం చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. కళాశాల విద్యార్థులకు ఇంత మెరుగైన మౌలిక సదుపాయాలతో వసతి భవనం నిర్మించడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు వసతులను చూసి ఆశ్చర్యానికి గురవుతున్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వం పాఠశాలలకు కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మారిన రూపురేఖలు



గతంలో కళాశాల విద్యార్థినిలు వసతి సమస్య తీవ్రంగా వేధిస్తూ ఉండేది. నిధులతో కళాశాలలో బాలికల వసతి గృహం రూపురేఖలే మారుతున్నాయి. వసతి గృహంలో సమస్యలుండడంతో గత కొన్నేళ్లుగా కళాశాల విద్యార్థినులు ఇంటి నుంచే రాకపోకలు చేస్తూ వచ్చారు. అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్న భవనం అందుబాటులోకి వస్తే బాలికల వసతి సమస్య పూర్తిగా తీరనుంది.

– డి.శ్రావణ్‌కుమార్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ముంచంగిపుట్టు

సమస్యలు పరిష్కరించాలని వినతి



టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

చింతూరు: తమ సమస్యలు పరిష్కరించాలని టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డిని ఆదివారం విశాఖపట్నంలో కలసి వినతిపత్రం సమర్పించినట్టు జిల్లా గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అనంతరం సుబ్బారెడ్డితో పాటు అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డిని సన్మానించినట్టు వారు తెలిపారు. అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బలరాం, మీడియా కన్వీనర్ గౌతంరాజు, కోశాధికారి జోడె నాగేశ్వరరావు, సురేష్, శరత్‌పవార్ పాల్గొన్నారు.

పొదుపు సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న ఎంఎంఎస్ అధ్యక్షురాలు పావని

గంగవరం : గ్రామంలోని అన్ని పొదుపు సంఘాలు బలోపేతం కావాలని గ్రామ సంఘం ద్వారా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, గంగవరం వీఓ అధ్యక్షురాలు శారపు పావని మహిళలను సూచించారు. మండల కేంద్రంలోని ఆదివారం జరిగిన గ్రామ సంఘం సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి ప్రసంగించారు. గ్రామ సంఘం ద్వారా పొదుపు సంఘాలకు చిన్న చిన్న రుణాలు మంజూరు చేస్తోందని, వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో రుణాలు పొందిన సంఘాలు సకాలంలో రుణాలు చెల్లిస్తే తిరిగి కొత్త రుణాలు ఇచ్చే అవకాశం ఉందన్నారు. పొదుపు ఖాతాలు సక్రమంగా పాటించాలన్నారు. వీఓ కార్యదర్శి బి.కుమారి, సీసీ విజయలక్ష్మి సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వెతలు తీరేనా!

- అప్పలరాజుపేటలోని శిథిలదశకు చేరిన అంగన్‌వాడీ కేంద్రం
- వేములోవలో అసంపూర్తిగా డైనింగ్ హాల్



అప్పలరాజుపేటలోని శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్ర భవనం

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట గిరిజన గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రం భవనం శిథిలావస్థకు చేరింది. భవనం చుట్టు చీమల పుట్టలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. వర్షం వస్తే ఈ భవనం కారిపోతుండడంతో ఈ కేంద్రం కొన్నేళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. భవనం దాదాపు కూలిపోయే దశకు చేరింది. విషసర్పాలకు నిలయంగా మారింది. ఈ పాడైపోయిన భవనాన్ని ఆనుకొని స్థానిక ప్రభుత్వ పాఠశాల కూడా ఉందని, చిన్నారులు ఇటువైపుగా వస్తుంటారని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



వేములోవ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న డైనింగ్ హాల్

గంగవరం: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో వేములోవ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం పైకప్పు పెచ్చులూడుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా భవనం శిథిలవస్థకు చేరుకుందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. ఆశ్రమ పాఠశాలలో డైనింగ్ హాల్ అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులు సమీపంలో శిథిలదశలో ఉన్న ఆశ్రమ హాస్టల్‌లో భవనంలో భోజనాలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయంపై పాఠశాల హెచ్‌ఎం గీతాంజలి మాట్లాడుతూ పాఠశాలలో సమస్యలను వసతి గృహం భవనాలు దుస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. నాడు–నేడు రూ. 15లక్షల నిధులతో పాఠశాల భవనాలు, తరగతి గదులు అభివృద్ధి చేయడం, మరుగుదొడ్లు నిర్మించినట్టు చెప్పారు. ఇంకా మరిన్ని మరుగుదొడ్లు అవసరం ఉందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

నేడు గృహ సారథులు, కన్వీనర్ల సమావేశం

చింతూరు: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. సర్పంచ్ కారం కన్నారావు ఇంటివద్ద మధ్యాహ్నం రెండు గంటల సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

9న సీతారాముల విగ్రహ ప్రతిష్ట



మూలపేటలో ముస్తాబైన రామాలయం

కొయ్యూరు: మూలపేటలోని రామాలయంలో ఈనెల 9న సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్నట్టు అర్చకులు దండీల అప్పల తమ్మయ్య దేవర ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అన్నసమరాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యాలయాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయం కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని విద్యాలయాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబుతో పాటు, స్థానిక ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పదవుల్లో నేతలంతా ఈ ప్రచారంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

సెల్ టవర్ నిర్మాణానికి భూమిపూజ



సెల్‌టవర్ నిర్మాణానికి గ్రామస్తులతో కలిసి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ రామారావు

రాజవొమ్మంగి: మండలంలోని లోదొడ్డి గ్రామంలో సెల్ టవర్ నిర్మాణానికి సర్పంచ్ లోతా రామారావు ఆదివారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని పాకవెల్తి, పూదేడు, కేశవరం తదతర గ్రామాలకు నెట్‌వర్క్ లేకపోవడంతో కనీసం 108 వాహనానికి సమాచారం అందించలేని పరిస్థితి ఉందన్నారు. సెల్ సేవలు అందక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిగ్నల్ వ్యవస్థ లేక సచివాలయాల్లో కూడా పనులు కుంటుపడుతున్నాయన్నారు. సెల్‌టవర్ నిర్మించడం వల్ల సమాచార వ్యవస్థ మెరుగుపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జియో సంస్థ సెల్ టవర్ ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. సెల్ టవర్ అందుబాటులోకి వస్తే పంచాయతీ పరిధిలోని సమాచార వ్యవస్థ మరింత మెరుగుపడుతోందన్నారరు. వైస్ సర్పంచ్ రాజుబాబు, వార్డుమెంబర్లు రాజుబాబు, సుజాత, చిన్నమ్మి, సత్యన్నారాయణ తదతరులు పాల్గొన్నారు.

గృహ సారథులు సంక్షేమ వారధులు



మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

వీఆర్ పురం: గృహ సారథులు ప్రజలకు ప్రభుత్వ సేవలందించాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని రేఖపల్లిలో ఆదివారం నిర్వహించిన ‘మా నమ్మకం నువ్వే జగనన్న’ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వలంటీర్లతో కలిసి ప్రతీ ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. గృహ సారథులు సంక్షేమ వారుధులని అభివర్ణించారు. అనంతరం గృహసారధులు, కన్వీనర్లకు ప్రభుత్వ పథకాల సమాచారంతో కూడిన కిట్లును పంపిణీ చేశారు. నాయకులు శ్రీనివాస్ , గంగులు, మురళి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సత్యనారాయణ, ఎస్టీ ఎస్సీ విజిలెన్స్, మానీటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, ప్రజాప్రతినిధులు విజయలక్ష్మి, గంగాభవాని, రామారావు, శారద, రమాదేవీ, జయ, నరసమ్మ, నేతలు జయరాజ్, వెంకటరమణ, గౌతమ్, బాలాజీ, వెంగళరావు, బాలరాజు, కాంతారావు, రాజు, నరేష్, రాజేష్, నాగేశ్వరరావు, కృష్ణ, సాయి, లక్ష్మణ్, రాజుపేట ఉప సర్పంచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయుని తీర్థం



మహిళల కోలాటాల ప్రదర్శన

కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెంలో అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామికి పూలు, వడలతో దండలు చేసి, అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామచంద్రాపురం, లంకెలపాలెం, గాజువాక తదితర ప్రాంతాల నుంచి వచ్చిన బృందాల మహిళలు ప్రదర్శించిన కోలాటాలు ఆహూతులను అలరించాయి. మాజీ సర్పంచ్ కలగా రామునాయుడు, గోవిందల ఆధ్వర్యంలో జరిగిన తీర్థ మహోత్సవానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి ఉత్సాహంగా ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన అమ్మవారి ఉత్సవాలు

- వేడుకగా వెలంపేట గౌరమ్మ నిమజ్జనోత్సవం



కశింకోటలోని గవరపేటలో శారదానదిలో గౌరమ్మ నిమజ్జనం

కశింకోట : స్థానిక వెలంపేట గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) నిమజ్జనోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా గౌరమ్మ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి ఆర్కెస్ట్రా, మేళతాళాలతో గవరపేట, పెదగుమ్మం వద్ద శారదానది వరకు ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రజలు గౌరమ్మను దర్శించుకుని పూజలు చేశారు. బాణసంచా కాల్చారు. అనంతరం గౌరమ్మ విగ్రహానికి నది ఒడ్డున సంప్రదాయంగా పూజలు నిర్వహించి, నదిలో నిమజ్జనం చేశారు. ఈ ఏడాదంతా చల్లగ కాచిన తల్లీ.. వచ్చే ఏడాది మళ్లీ రావమ్మా.. అంటూ మొక్కుకున్నారు. శనివారం రాత్రి ఉత్సవం సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు ఉత్సాహంగా హాజరయ్యారు. రేలా రేలా రే, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, బుర్రకథ, గంధవరం బృందంతో వెంకటరమణమూర్తి పాట ఆలాపన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వరాహలక్ష్మీ నృసింహునికి ప్రత్యేక పూజలు రేపు

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో మంగళవారం పలు ఆధ్యాత్మిక, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, అమ్మవారికి నూతన చీర అలంకరణ, దీపాలంకరణ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులంతా పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు సేవించాల్సిందిగా కోరారు.

ఆకట్టుకున్న గుర్రాల పరుగు పందెం

వైభవంగా మోదకొండమ్మ పాదాలు తీర్థం



గుర్రాల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ రాజారామ్

మాడుగుల: ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వెలసిన మోదకొండమ్మ పాదాలు తీర్థం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కోలాటాలు, డప్పులు, వాయిద్యాలు నడుమ వందలాది మంది భక్తులు అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలు శిరస్సున పెట్టుకుని ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శక్తివేషాలు, నేల వేషాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ ప్రారంభించారు. అంతకు ముందు ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. తీర్థం సందర్భంగా ఘాట్‌రోడ్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన గుర్రాల పరుగు పందేలను ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, శ్రీనాథు జగ్గారావు, కమిటీ సభ్యులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీలు చూడటానికి మండలం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి ఆసక్తిగా తిలకించారు. వర్తక సంఘం సభ్యులు కొట్ని సత్తిబాబు, పుట్టా బలరామ్, పెచ్చేటి కొండలరావు, పెచ్చేటి నానాజీ, కోట్ని వెంకట శ్రీనువాస్ పాల్గొన్నారు.

వేడుకగా వేంకటేశ్వర స్వామి పల్లకి సేవ



స్వామివారి పల్లకి సేవలో భక్తులు

రోలుగుంట: స్థానిక కొండపైన వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 2న ప్రారంభమైన వెంకన్న కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు. గ్రామ వీధుల్లో ఊరేగింపుగా తీసుకురాగా, భక్తులు దర్శించుకుని బియ్యం, పప్పు తదితర స్వయంపాకం సరకులను సమర్పించుకున్నారు. ఈ నెల 7వ తేదీ వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ తెలిపారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలి



హుకుంపేటలో ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అరకు ఎంపీ మాధవి, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, అరకు అసెంబ్లీ పరిశీలకులు కొండబాబు, నేతలు



ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, నేతలు

హుకుంపేట/పెదబయలు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ హుకుంపేట, పెదబయలులో మండలాల్లోని ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అరుకు అసెంబ్లీ పరిశీలకులు కొండపల్లి కొండలరావు, స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ స్వాతిరాణితో కలిసి పర్యటించారు. ఈ నేపథ్యంలో ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, మండల పార్టీ అధ్యక్షుడు కొండబాబు, గౌరవ అధ్యక్షుడు గండేరు సత్యం, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు విశ్వేశ్వరరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మెన్ కొండలరావు, మాజీ ఎంపీపీ రవిప్రసాద్, యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తిబాబు, సర్పంచ్‌లు వెంకటపూర్ణిమ, బొంజుబాబు, సత్యవతి, మండల పార్టీ కన్వీనర్లు భూషణ్, కోటిబాబు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. పెదబయలులో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బొండా వరహాలమ్మ, వైస్ ఎంపీపీ కొర్ర రాజుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు వంతాల ఆనందరావు, సర్పంచ్ కృష్ణారావు, రాష్ట్ర అగ్రో డైరెక్టర్ సన్యాసి, స్వచ్ఛభారత్ డైరెక్టర్ సోమేశ్వరి, నాయకులు గంగాభవాని, సూర్యనారాయణ, సూరయ్య, కొండబాబు, చంద్రబాబు, రాజారావు, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేసి గెలిపించాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రం పాడేరులోని ఆదివారం ప్రధాన జంక్షన్‌లు, పలు వీధుల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి అర్హులైన పట్టభద్రులను స్వయంగా కలిశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఎన్నికల ప్రచార కరపత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓట్లు వేసి గిరిజన అభివృద్ధికి సహకరించాలని కోరారు. పట్టభద్రుల ఓటర్లంతా సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వాన్నే కోరుకోవాలన్నారు. పార్టీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొడ్డేటి మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు చిట్టెమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లకే రామసత్యవతి, మాజీ ఎంపీపీ మంగ్లన్నదొర, యువజన విభాగ మండల, పట్టణ అధ్యక్షులు కొట్టగుళ్లి కొండాజీ, డి.పి.రాంబాబు, ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి నాగేంద్ర, మాజీ సర్పంచ్ కన్నాపాత్రుడు, సోషల్ మీడియా మండల కన్వీనర్ అల్లాడ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: ఉత్తరాంధ్ర పట్టభద్రల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ప్రచారం చేశారు. ప్రచార కరపత్రాలను అందజేశారు. రాంప్రసాద్, అశోక్, రాందాస్ పాల్గొన్నారు.